


ఎడతెరిపి లేని వాన
● అప్రమత్తమైన అధికార యంత్రాంగం
● కృష్ణానదిలో ప్రయాణంపై ఆంక్షలు
● దుందుభీ నదికి పెరుగుతున్న వరద
● కేఎల్ఐ కాలువకు గండి
6

సీతాఫలాల సేకరణకు టెండర్లు
● మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్‌లకు రూ.8 లక్షలపైనే..
7







నెట్టింట్లో బాల్యం

● అన్నం తినాలంటే అదే.. క్లాసులు వినాలన్నా అదే..
● పడుకునే సమయంలోనూ రీల్స్ చూస్తూ కాలక్షేపం
● బయట ఆటలకంటే.. సెల్‌ఫోన్‌లో ఆటలపైనే మక్కువ
● తల్లిదండ్రులదే తప్పు.. మానసిక సమస్యలతో ముప్పు

స్మార్ట్ ఫోన్లు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి.. వారిని నాలుగు గోడలకే పరిమితం చేసి, సృజనాత్మకతకు గొడ్డలిపెట్టులా మారాయి. గంటల తరబడి ఫోన్ చూడటం వల్ల కళ్లు దెబ్బతినడంతోపాటు ఏకాగ్రతను కోల్పోతున్నారు. నెలల వయస్సున్న చిన్నారులు సైతం సెల్‌ఫోన్లకు బానిసలవడం ఆందోళన కలిగిస్తోంది. ఇంతకు ముందు చిన్నారులకు అన్నం తినిపించేటప్పుడు చందమామ రావే జాబిల్లి రావే అని చంద్రుడిని చూపించి తినిపిస్తే.. ఇప్పుడు స్మార్ట్ ఫోన్ చేతిలో పెడితే గానీ ముద్ద మింగడం లేదు.

ఫోన్ ఇవ్వకుంటే ఏడ్పులు.. ఇచ్చేదాక మంకుపట్టు

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పెరుగుతన్న సాంకేతిక మంచికే అని సంతోషించాలో.. బానిసలుగా మార్చుతుందని దుఃఖించాలో తెలియని అయోమయ స్థితిలో ప్రస్తుత సమాజం ఉంది. ఇన్‌స్టాలో రీల్స్ చూడటం.. ఫేస్‌బుక్ మిత్రులతో కబుర్లు చెప్పుకోవడం, వాట్సప్‌తో స్టేటస్‌లను పంచుకోవడం, ఎక్స్ హ్యాండిల్‌లో తాజా ట్వీట్లు చదవడం, యూట్యూబ్ ప్రపంచంలో మునిగి తేలడం, స్నాప్ చాట్‌లో ఫొటోలు తీసుకోవడం షరా మామూలు అయిపోయింది ఈ రోజుల్లో.. పెద్దవారు తమ ఆఫీసు పనుల కోసమో.. పని ఒత్తిడి నుంచి ఉపశమనం కావడం కోసమో.. ఫోన్ ఎక్కువగా చూస్తున్నామని చెబుతుంటారు.. మరి పిల్లలు ఫోన్ ఎందుకు ఎక్కువగా చూస్తున్నారంటే గతంలో కారణాలు ఉండేవి కావు.. కానీ కరోనా తర్వాత నుంచి ఆన్‌లైన్ క్లాసులనో.. స్టడీ మెటీరియల్ కోసమనో సాకులు చెబుతూ నెట్టింట్లో మునిగి తేలుతున్నారు. పాఠశాల నుంచి వచ్చినప్పటి నుంచి మళ్లీ స్కూల్ బస్సు ఎక్కే వరకు తమ సమయాన్ని అత్యధికంగా సెల్‌ఫోన్‌తోనే గడుపుతున్నారు. అన్నం తినాలన్నా అదే.. ఇంట్లో పేరెంట్స్ వారి పని చేసుకోవాలన్నా అదే..

(మిగతా 6లో..)

ఆంధ్రజ్యోతి సర్వే

ఆరు ప్రశ్నలతో ఆంధ్రజ్యోతి సర్వే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రైమరీ దశ నుంచి హైస్కూల్ వరకు పిల్లలు సెల్‌ఫోన్ ఏ మేరకు వాడుతున్నారు? అనే విషయంపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం సర్వే నిర్వహించింది. మొత్తం ఆరు ప్రశ్నలను విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి, 2,600 అభిప్రాయాలను సేకరించింది. ఇందులో పేరెంట్స్ చెప్పిన ప్రకారం ఫోన్‌కు పిల్లలు బానిసలుగా మారుతున్నారనేది స్పష్టమవుతోంది. ఫోన్ ఇవ్వకుంటే ఏడవడం, స్కూల్ నుంచి రాగానే ఫోన్ పట్టుకోవడం, రాత్రి పొద్దుపోయే వరకు ఇంట్లో ఒంటరిగా రీల్స్ చూడటం, చదువుకు సంబంధించిన విషయాల కోసం ఫోన్ చూస్తున్నామని చెప్పడం వంటి విషయాల్లో విద్యార్థులు ఎక్కువగా ఫోన్‌కు బానిసలవుతున్నారు. అలాగే తల్లిదండ్రులకు తెలియకుండా సోషల్ మీడియా ఖాతాలను ఉపయోగించడం, అస్తమానం ఫోన్ మాట్లాడటం కూడా రానురాను పెరుగుతున్నట్లు సర్వేలో స్పష్టమైంది. ముందుగా తల్లిదండ్రులు వారికి అలవాటు చేసి.. ఇప్పుడు మానడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా చేస్తున్నారు.

మెదడుపై తీవ్ర ప్రభావం | సెల్‌ఫోన్‌తో కంటి సమస్యలు | పర్యవేక్షణ చాలా అవసరం
6వ పేజీలో..

ఫోన్ ఇవ్వకుంటే ఏడుస్తారు



మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఒకపాప మూడో తరగతి చదువుతోంది. మరో పాప యూకేజీ చదువుతోంది. ఇద్దరూ స్కూల్ నుంచి రాగానే కాసేపు ఫోన్ చూసిన తర్వాతనే హోం వర్క్ చేయడానికి కూర్చుంటారు. ఆ తర్వాత మళ్లీ కాసేపు ఫోన్ చూసి, రాత్రి భోజనం చేస్తారు. మళ్లీ పడుకునే ముందు ఫోన్ చూసి పడుకుంటారు. రోజూ ఇదే జరుగుతోంది. ఫోన్ ఇవ్వకుంటే ఏడుస్తారు. ఆదివారం వస్తే రోజంతా ఫోన్‌లోనే మునిగిపోతున్నారు.

– స్వప్న, దేశాయిపల్లి, దామరగిద్ద

ఫోన్ ఇస్తేనే భోజనం



ప్రస్తుతం పిల్లలు ఫోన్‌కు బాగా అలవాటై పోయారు. సాంకేతికత పెరగడంతో అనివార్యంగా ఫోన్‌లు ఇస్తున్న పరిస్థితులు ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పనుల్లో బిజీగా ఉండటం, పిల్లలు మారం చేస్తుండటంతో ఫోన్ ఇచ్చి బుజ్జగిస్తున్నారు. కరోనా తర్వాత ఆన్‌లైన్ క్లాసుల పేరిట మరింత వాడకం ఎక్కువైంది. తరగతుల వరకే పరిమితమైతే పర్వాలేదు. కానీ రీల్స్, వీడియోస్ చూస్తూ, గేమ్స్ ఆడుతున్నారు. ఫోన్ ఇస్తేనే భోజనం చేస్తున్నారు.

– రఘు, పేరెంట్, మక్తల్, నారాయణపేట

చదువే శాశ్వతం

● నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జీవితంలో డబ్బు, పరపతి ఏదీ శాశ్వతం కాదని, మనం చదివిన చదువే శాశ్వతమని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. నారాయణ పేట, మహబూబ్‌నగర్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నారాయణపేట జిల్లా కేంద్రంలోని అంజనా గార్డెన్‌లో బుధవారం కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవ అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డబ్బు వస్తుంది, పోతుందని.. కానీ నేర్చుకున్న విద్య మాత్రం మనతోనే చివరి దాకా ఉంటుందన్నారు. నేటి విద్యార్థులే రేపటి తరానికి వారసులన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు, ఉన్న ఊరికి మంచి పేరు తేవాలన్నారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో చెన్నైకి చెందిన శౌర్య చక్ర అవార్డు గ్రహీత వెంబు శంకర్, ముంబైకి చెందిన ప్రముఖ గాయకుడు సాయిరాం అయ్యర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, సత్యసాయి సేవా సమితి నారాయణపేట జిల్లా అధ్యక్షుడు చిట్టెం మాధవరెడ్డి, మహబూబ్‌నగర్ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా ఇంజనీరింగ్ విద్య

● మెరిట్ సాధించిన 100 మంది విద్యార్థులకు..
● సొంత నిధులతో చదివించాలని నిర్ణయం
● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాలనే తపన ఉండి పేదరికం కారణంగా ఉన్నత చదువులకు దూరమవుతున్న విద్యార్థులకు విద్య అందించేందుకు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముందుకువచ్చారు. మెరిట్ కలిగిన 100 మందిపేద విద్యార్థులకు ఉచితంగా ఇంజనీరింగ్ విద్యను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంటర్ మార్కుల ఆధారంగా దరఖాస్తులు తీసుకుని, బీపీఎల్ ప్రాతిపదికన మహబూబ్‌నగర్‌లోని జీకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇంజనీరింగ్ విద్యకు తానే ఫీజులు చెల్లించి ఉచిత విద్య అందిస్తానని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరులో ఒక మంచి వాతావరణం తేవాలని, పేదరికం కారణంగా విద్యకు ఎవరూ దూరం కావద్దన్న లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు కన్న కలలను నిజం చేస్తామని చెప్పారు. అదేవిధంగా శత శాతం పేరిట ఓ కార్యక్రమాన్ని తీసుకున్నామని, 26 ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం రిజల్ట్ తీసుకురావడానికి ఒక విద్యా వలంటీర్‌ను కూడా నియమిస్తామన్నారు. వందేమాతరం ఫౌండేషన్‌తో టై యప్ అయ్యి, గ్రామాలలో విద్యార్థుల వద్దకెళ్లి వారి ఉత్తీర్ణత వందశాతం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమర్‌రాజా కంపెనీతో మాట్లాడి 200 మందికి 3 కోర్సులలో శిక్షణ ఇప్పించే కార్యక్రమం చేస్తున్నామన్నారు. చుట్టూ ఉన్న గ్రామాల యువతకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రానున్న రోజుల్లో మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషన్, స్కిల్ డెలప్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. నగర ప్రముఖులు పేదలకు విద్యనందించేందుకు ముందుకు వచ్చి తోడ్పాటు అందించాలని కోరారు. ఉచిత ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తిగల విద్యార్థులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. సమావేశంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, నాయకులు పెద్ద విజయ్‌కుమార్, శాంతన్నయాదవ్, ఖాజాపాషా పాల్గొన్నారు.



యూరియా కోసం పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

యూరియా కోసం..

● దేవరకద్రలో బారులు తీరిన రైతులు

దేవరకద్ర, పాలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దేవరకద్ర మండల కేంద్రంలో రైతులు యూరియా కోసం బారులు తీరారు. మండల కేంద్రంలో యూరియా కొరత ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే వచ్చి సహకార సంఘం వద్ద లైన్లలో నిల్చుంటున్నారు. ఈ రోజైనా యూరియా వచ్చిందా? అని ఆరా తీస్తున్నారు. బుధవారం ఉదయం ఒక లారీ యూరియా రావటంతో రైతులు లైన్లో నిలబడి తీసుకెళ్లారు.

బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ
● కర్రీపఫ్‌లో పాముపిల్ల వచ్చిన ఘటనతో సోదాలు
● గడువుతీరిన సామగ్రి వాడుతున్నట్లు గుర్తింపు
7

భారీ వర్షాలతో సెలవులకు బ్రేక్

● అధికారులకు, సిబ్బందికి వచ్చే మూడు రోజులు లీవ్స్ లేవు
● అందరూ డ్యూటీలో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు



పెద్ద చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) అధికారుల వరుస సెలవులను కలెక్టర్ రద్దు చేశారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడం, అందులో మహబూబ్‌నగర్‌కు రెడ్ అలర్ట్ ఉండటంతో అధికారులు, సిబ్బందికి ఎవరికీ సెలవులు ఇవ్వొద్దని కలెక్టర్ విజయేందిర బోయి యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 15న పంద్రాగస్టు, 16న కృష్ణాష్టమి, 17న ఆదివారం కావడంతో మూడు రోజులు సెలవులు వస్తున్నాయి. అధికారులు క్యాలెండర్ ప్రకారం ముందుగానే సెలవులను ప్లాన్ చేసుకున్నారు. అయి తే వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడి వాళ్లు అక్కడే ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దాంతో అధికారులు నిరాశకు గురవుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అంత ప్రభావం లేకపోయినా.. ఈ వానలు కురిస్తే ఒక ప్రాంతంలో 20 సెంటీ మీటర్లు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అప్రమత్తం కావాల్సి వస్తోంది.

పెద్ద చెరువు పరిశీలన

నగరంలోని మినీ ట్యాంక్‌బండ్ పెద్ద చెరువును అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, నగర కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో బుధవారం కలిసి పరిశీలించారు. చెరువులో నీరు నిల్వ ఉంచొద్దని, వచ్చిన నీరు వచ్చినట్లుగా బయటకు పంపించాలని సూచించారు. ఇప్పటికే చెరువు 80 శాతం ఖాళీగా ఉంది. అతిభారీ వర్షం కురిసినా వచ్చే వరదనంతా చెరువులోకి మళ్లించడం ద్వారా లోతట్టు ప్రాంతాలైన రాయయ్యబౌళి, బీకేరెడ్డి కాలనీలకు ముప్పు ఉండదని యంత్రాంగం భావిస్తోంది.

వృద్ధుడి మెడపై బ్లేడు గాట్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలాజీనగర్‌లో గల నివాసంలో ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు కృష్ణయ్యగౌడ్(70) గొంతు, మెడ మధ్యలో బ్లేడ్‌తో కోసిన గాయాలు అనుమానాస్పదంగా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి తన గొంతుకోసి పారిపోయాడని బాధితుడు చెబుతుండగా పోలీసులు మాత్రం అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం తన నివాసంలో ఒంటరిగా ఉంటున్న కృష్ణయ్యగౌడ్ గొంతుపై గాయాలై, రక్తం కారుతుండటంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలం చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం ఎస్‌వీఎస్ ఆసుపత్రికి తరలించారు. లోతుగా గాయాలు లేవని, పైన ఉన్న చర్మం మాత్రమే కట్ కావడంతో ప్రాణాపాయం లేదని తెలుస్తోంది. బాధితుడికి నలుగురు కూతుళ్లు కాగా, వారికి పెళ్లిళ్లు చేసి ఒంటరిగా ఉంటున్నాడు. ఘటనా స్థలంలో కొన్ని కొత్త, కొన్ని పాత బ్లేడ్‌లు ఉన్నాయి. తల కింద ఉన్న బెడ్‌షీట్ కూడా బ్లేడ్‌తో కట్ చేసి ఉంది. ఎవరైనా వ్యక్తి వచ్చి గాయం చేశాడా? లేదంటే తనే గాయం చేసుకున్నాడా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

'ట్రంప్.. తన విధానాలు వెనక్కి తీసుకోవాలి'
6

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



మన్ననూరులో ఐటీడీఏ కార్యాలయ అధికారికి వినతి పత్రాన్ని అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మన్ననూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మన్ననూరులోని ఐటీడీఏ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ హాజరై గిరిజన విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన గురుకులాలు ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, శిథిలావస్థ దశకు చేరిన భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కారం కాకుంటే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ కార్యాలయ అధికారి ఎండీ జాఫర్ హుసేన్‌కు అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్, డివిజన్ నాయకులు ప్రవీణ్, విజయ్, అఖిల్, సుల్తాన్, మండల నాయకులు చరణ్, నగేష్ పాల్గొన్నారు.

ట్రంప్.. తన విధానాలు వెనక్కి తీసుకోవాలి



మహబూబ్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

పాలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంపై పెట్టిన అదనపు సుంకాలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, బీకేఎంయూ, ఏఐఏడబ్ల్యూ పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత వర్ధమాన దేశాలపై ఇష్టానుసారంగా ఆంక్షలు విధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా భారతదేశంపై 50శాతం పన్నులు విధించడం దుర్మార్గమైందన్నారు. అమెరికా విదేశాంగ విధానం అమలైతే భారతదేశంలోని కోళ్ల పరిశ్రమ, పాడిపరిశ్రమ, ఫార్మాపరిశ్రమ తీవ్రంగా దెబ్బతిని రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, దివాలా తీస్తారని ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంపై మోదీ అమెరికాకు జవాబు చెప్పాలన్నారు. కార్మిక, రైతు వ్యతిరేక లేబర్ కోడ్లు, నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, కిల్లెగోపాల్, ఖమర్ అలీ, వరద గాలెన్న, చంద్రకాంత్, ఆది విష్ణువర్ధన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, బి.కె.ఎం.యూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, గోపాల్‌నాయక్, మొగులన్న, అంజి, సుందర్, నాని, భార్గవి, పద్మావతి, ఇందిర, బుచ్చన్న, జాంగీర్‌లు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ పోచమ్మ బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

మన్ననూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అమ్రాబాద్ మండలం మన్ననూరులోని బేడ బుడగజంగాల కాలనీ వాసులు పోచమ్మ బోనాల పండుగను బుధవారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ప్రతీ ఏటా శ్రావణమాసంలో పోచమ్మ బోనాలను నిర్వహించడం కుల ఆచారం. బుధవారం మహిళలు అందంగా అలంకరించిన బోనపు కుండలతో యువకుల నృత్యాలు డప్పు వాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బోనాలను పోచమ్మ దేవతకు సమర్పించారు. నైవేద్యాలు, జంతు బలిహరణ చేసి కులదేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. కులస్థులందరూ కలిసి సామూహికంగా భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివాజీ గెలవయ్య, ఉపాధ్యక్షుడు ఆలేటి రామలింగం, కమిటీ సభ్యులు కప్పెర నిరంజన్, శ్రీను, కృష్ణగోపాల్, వెంకటయ్య, వంశీ, స్వామి, ప్రసాద్, నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వాన

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- కృష్ణానదిలో ప్రయాణంపై ఆంక్షలు
- దుందుభీ నదికి పెరుగుతున్న వరద
- జూపల్లి శివారులో కేఎల్ఐ కాలువకు గండి

కొల్లాపూర్/ తాడూరు/ తెలకపల్లి/ చారకొండ/ మరికల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న మూడు రోజుల పాటు తీవ్ర వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసు, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతుండటంతో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో బోటు ప్రయాణంతో పాటు, చేపల వేటను నిషేధించారు. నదీ తీరం వెంట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సోమశిల, అమరగిరి, మంచాలకట్ట, మల్లేశ్వరం, చెల్లెపాడు, కాలూరు, కృష్ణానది తీర ప్రాంతాల్లో మర బోట్లు ఒడ్డుకు చేరుకున్నాయి. వరద ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కొల్లాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ సూచించారు. నదిలో చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.



నిండుకుండలా ఉన్న సోమశిల కృష్ణానది దృశ్యం



దుందుభీ నదిని దాటకుండా ముళ్లకంప, బారికేడ్ ఏర్పాటు చేసిన ఎంపీడీవో శ్రీనివాసులు, అధికారులు

మూడు మండలాలకు రాకపోకలు బంద్

ఎడతెరిపి లేని వర్షాలతో నాగర్‌కర్నూల్ జిల్లాలోని దుందుభీ నదిలో వరద కొనసాగుతోంది. దీంతో తాడూరు మండలంలోని సిర్సవాడ కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ మండలాలకు వారం రోగులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వే పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలను నిలిపివేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. దుందుభీ పరివాహక ప్రాంతాలైన పాపగల్ నుంచి గుట్టలపల్లి వరకు 13 గ్రామాల ప్రజలు నది దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. రామగిరి, కల్వకుర్తి, నడిగడ్డ, తెలకపల్లి మండలాల పరిధిలో దుందుభీ వాగును ఎవరూ దాటకుండా కంచె వేసినట్లు తెలకపల్లి ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. వాగు దాగ్గర ఒక పోలీసు 24 గంటలు డ్యూటీలో ఉంటారని తెలిపారు.

అలుగు పారుతున్న జిన్నారం వాగు

నారాయణపేట జిల్లా, మరికల్ మండలంలోని జిన్నారం వాగు ఉధృతంగా పారుతోంది. ఎస్ఐ రాములు, ఏఎస్ఐ ఎల్లయ్య బుధవారం వాగు పరిసరాలను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లొద్దని హెచ్చరించారు. ఎవరైనా వరదలో చిక్కుకుంటే, గమనించిన వారు వెంటనే 100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నీట మునిగిన పంటలు

నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలోని జూపల్లి గ్రామ శివారులో ఎంజీకేఎల్ఐ డీ-82 ప్రధాన కాల్వకు బుధవారం తెల్లవారుజామున గండి పడింది. దీంతో సమీపంలోని పొలాల్లో పంటలు నీట మునిగాయి. సమాచారం అందుకున్న నీటి పారుదల శాఖ ఎస్ఈ పార్థసారథి, డీఎస్పీ వెంకట్ రెడ్డి, ఈఈ శ్రీకాంత్, సీఐలు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగార్జునలు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువకు వెంటనే మరమ్మతు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎవరైనా కావాలని కాలువకు గండ్లు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. రాత్రి కల్వకుర్తి పట్టణంలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కాలువకు గండి ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'సంగంబండ' నుంచి నీటి విడుదల

మక్తల్‌రూరల్ (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని సంగంబండ జలాశయానికి ఎగువనున్న పెద్ద వాగు నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో బుధవారం మూడు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 1,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ సురేశ్ తెలిపారు. రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 3.313 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 12 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువ కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా గడిచిన 24 గంటల్లో 3.591 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు మొత్తంగా 220.321 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు తెలిపారు. దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 3.591 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు మొత్తం 260.693 మిలియిన్ యూనిట్ల విద్యుత్ రాబట్టినట్లు ఆయన తెలిపారు.



ఎంజీకేఎల్ఐ కాలువకు గండి పడడంతో వృథాగా పోతున్న నీరు




డీఎస్పీ వెంకట్‌రెడ్డితో మాట్లాడుతున్న నీటి పారుదల శాఖ ఎస్ఈ పార్థసారథి

రోజంతా ముసురు

మహబూబ్‌నగర్/నారాయణపేట/నాగర్‌కర్నూల్ టౌన్/వనపర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో బుధవారం రోజంతా ముసురు కురుస్తూనే ఉంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలో 23.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో 22.0 మి.మీ., కొత్తపల్లి మండలంలో 15.3, నర్వ మండలంలో 14.3, గుండుమాల్ మండలంలో 13.5, దామరగిద్ద మండలంలో 13.0, ధన్వాడ మండలంలో 55.8 మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలో 20.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. పెద్దకొత్తపల్లిలో 17.2, అమ్రాబాదులో 15.6, పదరలో 13.4, చారకొండలో 13.2, ఉప్పు నుంతలలో 12.2, పెంట్లవెల్లిలో 12.0, కల్వకుర్తిలో 11.4, కోడేరులో 11.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలంలో 14 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం



కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో 29.5 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

దేవరకద్ర, (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం రోజురోజుకూ పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి 29.5 అడుగులకు చేరుకుంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 32.5 అడుగులు కాగా, ప్రస్తుతం 29.5 అడుగుల మేర నీరు చేరింది. మరో మూడు అడుగుల మేర నీరు చేరితే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుతుంది. అప్పుడు గేట్లు తెరిచే అవకాశం ఉందని ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

వర్షానికి కూలిన ఇల్లు



ఖిల్లా గణపురంలో కూలిన ఇంటిలో బాధితుడు వాకిటి కొండన్న

ఖిల్లాగణపురం (ఆంధ్రజ్యోతి) : వరుస వర్షాలతో వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో షాపురం వాకిటి కొండన్నకు చెందిన మట్టి ఇల్లు బుధవారం సాయంత్రం కూలిపోయింది. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి వెళ్లాలని సూచించగా, అదే ఇంట్లోని మరో గదిలో ఉంటామని వారు తెలిపారు. మరో మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సుగుణ సూచించారు.

చంద్రసాగర్ - అమ్రాబాద్ ఎత్తిపోతల చేపట్టాలి

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

కొత్తకోట ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో నదుల నీటికి నోచుకోని ప్రాంతాలకు చంద్రసాగర్ - అమ్రాబాద్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తకోటలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలను విస్తరించిన నల్లమల అప్పర్ ప్లాట్ సమీపంలో కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా అక్కడి భూములకు వర్షపు నీరే ఆధారమన్నారు. సాగునీరు లేనందున ఆ ప్రాంతాల ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వాలు చదువు అందించలేక పోవడంతో నిరాక్ష్యరాసులుగా అభివృద్ధికి అందనంత దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లమల బిడ్డగా చెప్పుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి అమ్రాబాద్, పదర మండలాల అభివృద్ధి.. సాగునీటితో సాధ్యమవుతుందని గ్రహించకపోవడం దురదృష్టకరమన్నారు. దుందభీ నీటి నిలువ కోసం డిండి ప్రాజెక్టు నిర్మించి వందేళ్లు అవుతున్నా ఆ ప్రాజెక్టుపై ఎత్తిపోతల ఏర్పాటు చేసి సాగునీరు అందించాలనే ఆలోచన చేయడంలో నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. నల్లమల ప్రాంతాల్లో నివసిస్తున్న చెంచుల జీవితాలను బాగు చేసే కార్యాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపాదికన చేపట్టాలన్నారు. మత్స్య సంపద హక్కులు కల్పించడానికి ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో వేదిక నాయకులు వెంకటేశ్వర్లు, నారాయణ, వెంకట్రాములు ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, నాయకులు

జాతీయ స్థాయి పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి చాంపియన్‌షిప్ 2025 సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. బుధవారం జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులు పి.ఆనంద వర్షిణి, ఎం.వి.ధ్యానాంజలి, ఎం.కీర్తి, టి.రుత్విక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ అమరేందర్‌ను కలిశారు. అదనపు కలెక్టర్ వీరిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాం, డీఎస్‌వో వెంకటరాములు, కోచ్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గద్వాల జిల్లా క్రీడాకారులు



జిల్లా క్రీడాకారిణులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి

గద్వాల అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు జోగులాంబ గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు నందిని, లక్ష్మి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి, ఫిజికల్ డైరెక్టర్లు బీసన్న, హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థినులు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 3న సిద్దిపేట జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ గర్ల్స్ ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపిక కావడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ నెల 18 నుంచి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని నారాయణపూర్‌లో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కాగా, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ క్రీడాకారిణులు నందిని, లక్ష్మి ఎంపికపై అసోసియేషన్ అధ్యక్షుడు బండల వెంకట్రాములు, కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి త్యాగరాజు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్ సేవా సమితి అధ్యక్షుడు ఇండికా శివ, సీనియర్ క్రీడాకారులు జగన్, తిరుమల్, రమణ, నవీన్, ఆనంద్‌కుమార్, మాజీ కౌన్సిలర్ పాండు ఉన్నారు.

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థిని ఎంపిక

తెలకపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలోని సిద్ధార్థ మోడల్ స్కూల్‌లో మూడో తరగతి చదివిన ఎస్.వైష్ణవి రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ స్కూల్ నాలుగో తరగతికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ గౌడ్, ఎం.శివప్రసాద్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో ఐదో ర్యాంకు సాధించి హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌కు చిన్నారి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారితో పాటు పాఠశాల కరెస్పాండెంట్ ఎం.విజయ్‌గౌడ్, స్వేరోస్ జిల్లా నాయకుడు శివ శంకర్, విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆ విద్యార్థినికి అభినందనలు తెలిపారు.



ఎస్.వైష్ణవి

(5వ పేజీ తరువాయి)

నెట్టింట్లో బాల్యం

ఏడిస్తే అదే.. సంతోషంలో ఉన్నా అదే.. ఆటలు ఆడేది అందులోనే.. పాటలు పాడేది, డాన్సులు చేసేది దాంతోనే.. ఏడ్చినా అదే.. మారం చేసినా అదే.. ఒకప్పుడు హోం వర్క్ అయిపోయిందంటే ఆడుకోవడానికి అనుమతిచ్చే పేరెంట్స్.. ఇప్పుడు ఫోన్ ఇస్తా హోం వర్క్ పూర్తి చేయవా? అంటూ బుజ్జగించాల్సిన పరిస్థితికి వచ్చారు. పిల్లలకు క్రమంగా ఫోన్ అలవాటు చేసి, ఫోన్ అధికంగా చూస్తున్నారని ఫిర్యాదు చేస్తున్నారు. ఫోన్ వల్ల కలిగే నష్టాలు, అవసరమైనప్పుడు దాన్ని వాడుకోవడం వల్ల కలిగే లాభాలను వారికి అర్థమయ్యేలా వివరించకపోవడం వల్ల బాల్యం మొత్తం నెట్టింట్లో గడిచిపోతుంది. కొందరు పేరెంట్స్ అయితే "ఫోన్ ఎంత బాగా ఆపరేట్ చేస్తాడో తెలుసా? మా వాడికి సెల్‌ఫోన్‌లో ఆప్షన్లు అన్నీ తెలుసు.. ఏదడిగినా నిమిషాల్లో చేస్తాడు" అని గొప్పలు చెప్పుకోవడం కొసమెరుపుగా చెప్పవచ్చు.

అధిక వినియోగంతో ముప్పే..

సెల్‌ఫోన్‌ను అధికంగా ఉపయోగించడం వల్ల తలనొప్పి, మైగ్రేయిన్, డిజిటల్ ఐ స్ట్రెయిన్ వంటి సమస్యలతో పాటు కంటిచూపు మందగిస్తుంది. పిల్లలు శ్రద్ధగా వినే సామర్థ్యాన్ని కోల్పోతారు. ఫలితంగా చదువుపై దృష్టి పెట్టక.. వెనుకబడే ప్రమాదం ఉంది. ఎక్కువసేపు కూర్చుని ఉండటం, ఏం తింటున్నారో, ఎంత తింటున్నారో తెలియకపోవడం వల్ల బరువు పెరిగి ఊబకాయులుగా మారుతారు. నిద్రలేమి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. సెల్‌ఫోన్ గేమ్స్‌కు ఎక్కువగా అలవాటుపడి ఫిజికల్ యాక్టివిటీ తక్కువవుతోంది. క్రమంగా ఏం చేసినా అలసట వస్తుంది. చిన్న వయసులోనే రక్తపోటు సమస్యలు ఉత్పన్నమవుతాయి. విపరీతమైన ఒత్తిడి, అవసరంలేని పోటీ భావన పెరిగి.. మానసికంగా అస్థిరతకు లోనవుతారు. డిజిటల్ సంబంధాలకు, కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యమిస్తూ సహజ మానవ సంబంధాలకు దూరమవుతారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

టీవీ, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, కంప్యూటర్ ఏమైనా సరే రెండు గంటలు దాటి వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతీ 20 నిమిషాలకు ఓసారి 20 సెకన్ల విరామం ఇస్తూ 20 అడుగుల దూరం నుంచి చూడొచ్చు.. అదీ విద్యా సంబంధ విషయాలైతే మాత్రమే. ఎంటర్‌టైన్‌మెంట్ కంటెంట్ జోలికి వెళ్లకపోవడం మంచిది. రాత్రి పడుకునే ముందు మొబైల్ చూడనివ్వొద్దు. రాత్రి 8 గంటల తర్వాత నెట్, టెక్ ఫ్రీ జోన్‌గా ఇంటిని మార్చేయాలి. అవసరం ఉన్నా సరే మొబైల్ డేటాకు దూరంగా ఉండాలి. పిల్లలు ఏం చూస్తున్నారు? ఏం చేస్తున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రుల పరిశీలన కచ్చితంగా అవసరం. చిన్నారులు సోషల్ ఖాతాలు సృష్టించుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఫోన్ వాడటం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉంటుందో వారికి అర్థమయ్యే రీతిలో వివరించాలి.

ఫోనే ప్రపంచమైంది..



నేడు పిల్లల చేతిలో ఫోన్ లేకపోతే ఉండలేని పరిస్థితి ఏర్పడింది. ఫోన్‌తో మేలు కంటే నష్టం ఎక్కువగా ఉంది. సెల్‌ఫోనే ప్రపంచమైంది. మా పిల్లలు తరగతుల కోసమని ఫోన్ తీసుకుంటారు. ఆ తర్వాత వారికి నచ్చిన వీడియోలు చూస్తుంటారు. అది గమనించి ఫోన్ తీసుకుంటాం. ఫోన్ ఎక్కువగా చూడటం వల్ల కళ్లు దెబ్బతింటాయని చెబుతాం. కానీ ఫోన్ ఇవ్వకుంటే మారం చేస్తారు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ క్లాసులకు ఏదైనా ప్రత్యామ్నాయం కావాలి.

- ఎస్ రవి, పేరెంట్, అచ్చంపేట

లేచినప్పటి నుంచే..



నాకు ఇద్దరు బాబులు.. ఒకరు ఆరో తరగతి.. మరొకరు ఒకటో తరగతి చదువుతున్నారు. పిల్లలకు ఫోన్ బాగా అలవాటైంది. ఉదయం లేస్తేనే ఫోన్ పట్టుకుని వీడియోలు, రీల్స్ చూస్తారు.. గేమ్స్ ఆడతారు. అలాగే స్కూల్ నుంచి రాగానే మళ్లీ ఫోన్‌లోనే ఎక్కువ సమయం గడుపుతారు. లేచిన దగ్గర నుంచి పడుకునే వరకు మొబైల్ పట్టుకుని ఉంటారు. ఏదైనా కొప్పడితే ఏడుస్తారు? ఫోన్ ఇవ్వకుంటే అలుగుతరు. ఫోన్‌తో ఇబ్బంది పెరిగింది.

- ఎం. రేణుక, బొంకూరు, ఉండవల్లి

మెదడుపై తీవ్ర ప్రభావం



ఫోన్ చూడటానికి అలవాటు పడే పిల్లలకు మెదడుపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంటటుంది. చదువులో రాణించడం మందగిస్తుంది. ఇతర పిల్లలతో ఆడుకోవడం తగ్గుతుంది. సోషల్ మూమెంట్ కూడా తగ్గిపోయి కళ్ల మీద కూడా ప్రభావం చూపుతుంది. మాటలు రాని పిల్లలకు ఫోన్ అలవాటు చేస్తే మాటలు వచ్చే దశ ఆలస్యమవుతుంది. ఆటిజం వచ్చి.. చురుకుదనం తగ్గుతుంది. ఇతరులతో ఆడుకోరు. ఐ టూ ఐ కాంటాక్ట్ తగ్గిపోవడం, చుట్టుపక్కల జరిగేది వారి మైకంలో ఉండకపోవడం జరుగుతాయి. ఈ లక్షణాలను త్వరగా గుర్తిస్తే చికిత్స ఇవ్వగలం. లేదంటే కష్టమవుతుంది. ఫోన్ అలవాటుపడ్డ పిల్లలను తల్లిదండ్రులు కథలు వంటి కొత్తకొత్త విషయాలను బోధించాలి. లేదంటే ప్రమాదమే.

- ప్రొఫెసర్ డాక్టర్ చంద్రమోహన్, చిన్నపిల్లల వైద్యనిపుణులు, జీజీహెచ్, వనపర్తి

సెల్‌ఫోన్‌తో కంటి సమస్యలు



ప్రస్తుతం చిన్న వయసులో ఉన్నవారే ఎక్కువగా సెల్‌ఫోన్ వినియోగిస్తున్నారు. దీనివల్ల కంటి సమస్యలు తీవ్రంగా వస్తాయి. మొబైల్ స్ర్కీన్ నుంచి వెలువడే నీలి కాంతి వల్ల కంటిపై ఒత్తిడి పడుతుంది. కళ్లు పొడిబారుతాయి. దృష్టి మందగిస్తుంది. తలనొప్పి కూడా తీవ్రంగా వస్తుంది. నిద్రలేమికి గురవుతారు. మెదడు సామర్థ్యం మందగిస్తుంది. బయట ఆటలు ఆడటానికి ఎక్కువగా ఇష్టపడరు.. సెల్‌ఫోన్ గేములపై శ్రద్ధ చూపుతారు. సెల్‌ఫోన్‌లో వచ్చే అశ్లీల కంటెంట్‌ను చూసి విద్యార్థులు చెడిపోతారు. ఫిజికల్ యాక్టివిటీ తగ్గడం వల్ల ఎదుగుదల కూడా లోపిస్తుంది. ఏం తినకపోవడం, ఎక్కువగా తినడం వంటి సమస్యలు కూడా ఉత్పన్నమవుతాయి. తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ మహేష్, కంటి వైద్య నిపుణులు, జీజీహెచ్ గద్వాల

తల్లిదండ్రుల పర్యవేక్షణ చాలా అవసరం



పిల్లలకు తల్లిదండ్రులే ఫోన్ అలవాటు చేస్తున్నారు. తినకపోయినా, చదవకపోయినా ఫోన్లు ఇస్తున్నారు. దీంతో వారికి అది అలవాటుగా మారుతోంది. దాంతో ఏకాగ్రత తగ్గిపోతుంది. చదువుపై ఆసక్తి ఉండదు. మొండిగా ప్రవర్తిస్తారు. బెదిరిస్తారు. చచ్చిపోతా అని కూడా బెదిరిస్తారు. ప్రస్తుతం వస్తున్న కేసులు 5 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. లైంగిక దాడులకు కూడా పాల్పడుతున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి. అందువలన తల్లిదండ్రులు తమ పిల్లలపై పర్యవేక్షణ అవసరం. ఫోన్ 15 నుంచి 30 నిముషాలు మాత్రమే ఇవ్వాలి. అది కూడా వారు ఏం చేస్తున్నారో గమనిస్తూ ఉండాలి. చదువులో మంచి మార్కులు వస్తే ప్రోత్సహించాలి. ఏదైనా బహుమతి ఇవ్వడం, పుస్తకాలు కొనివ్వడం, దుస్తులు కొనివ్వడం చేయాలి. వారిలో ఏమైనా మార్పులు వస్తున్నాయా గమనించాలి. తల్లిదండ్రులు వారితో ఎక్కువ సమయం గడిపేలా చూస్తే ఫోన్‌పై మనసు మళ్లించకుండా చేయవచ్చు.

- డాక్టర్ అనిల్‌రాజ్, మానసిక వ్యాధి నిపుణుడు






"విదేశీయుల పాలన నుంచి భారతదేశ విముక్తి లక్ష్యంగా సాగిన పోరాటాలు, ఉద్యమాలు, మహనీయుల త్యాగాల ఫలితం ఈనాడు మనమంతా అనుభవిస్తున్న స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు. తెలుగు నేల మీద సంఘ సంస్కరణోద్యమం, జాతీయోద్యమం కలగలిసి... మానవీయ విలువలకు పట్టంకట్టిన అద్భుతమైన కాలం అది. ఆ మహత్తర ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షులు మాత్రమే కాదు, అందులో భాగస్వాములు... గుత్తా జవహరీబాయి, రావూరి మనోరమ, ఏటుకూరి కృష్ణమూర్తి. 'స్వరాజ్యం మా జన్మహక్కు.' అని నినదించి జైలుకు వెళ్లిన, ఆ ముగ్గురు స్వాతంత్ర్య సమరయోధులను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'నవ్య' పలకరించింది.

ఆ త్యాగాలకు ఏదీ విలువ?

రహస్యంగా పత్రికలు బట్వాడా చేశా...

- ఏటుకూరి కృష్ణమూర్తి, 104 ఏళ్లు

"సామాజిక మార్పును కోరే కమ్యూనిస్టులే కలసి పని చేయలేకపోతున్నారు. ఇక సామాన్యులు ఐకమత్యంతో ఉండాలని కోరుకోవడం అత్యాశ అవుతుందేమో. గుంటూరు టౌన్ హైస్కూల్లో ఎస్ఎల్‌సీ చదువుతున్న రోజుల్లో 'క్విట్ ఇండియా' ఉద్యమానికి మద్దతుగా మేము నిరసన సభ నిర్వహించాం. కొందరు స్నేహితులం కలసి లాలాపేట పోలీస్ స్టేషన్‌మీద జాతీయ జెండా ఎగరేశాం. దాంతో పోలీసులు మమ్మల్ని అరెస్టు చేసి గుంటూరు సబ్ జైలులో నిర్బంధించారు. మాకు సంఘీభావంగా స్థానికులు పెద్ద సంఖ్యలో పరామర్శకు వస్తుండడంతో... మమ్మల్ని బాపట్ల, మంగళగిరి... అలా రకరకాల ప్రదేశాలు తిప్పారు. మేము నాలుగు నెలలకు పైగా జైలు జీవితం గడిపాం. దేశభక్త కొండా వెంకటప్పయ్య గారి మనుమలు నాకు మంచి స్నేహితులు. వారి ఇంటికి తరచుగా వెళ్లేవాణ్ణి. మరోవైపు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు లాంటి నాయకులను కలిసేవాణ్ణి.



ఆర్మీలో తిరుగుబాటు...

మా బాబాయి ఏటుకూరి జోగిరాజు సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నేనూ జాతీయోద్యమంలోకి వెళ్లాను. విజయవాడ నుంచి భారత కమ్యూనిస్టు పార్టీ 'స్వతంత్ర భారత్' పత్రిక ప్రచురించేది. ఆ పత్రికను గుంటూరులోని జాతీయోద్యమ నాయకులకు పంచే బాధ్యత నాది. అలా రహస్యంగా చాలాకాలం ఆ పత్రికల్ని బట్వాడా చేశాను. కొన్నాళ్లకు 'బ్రిటిష్ - ఇండియా ఆర్మీ'లో చేరాను. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా రాయల్ ఇండియన్ నేవీ సైనికులు తిరుగుబాటు ప్రారంభించారు. వారికి మద్దతుగా నేనూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నాను. మమ్మల్ని అరెస్టు చేసి, లాహోర్ జైల్‌లో కొన్నాళ్లు నిర్బంధించారు. దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత మమ్మల్ని విడుదల చేశారు. ఆ వెంటనే ఆంధ్రా రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో చేరాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు నావంతుగా సహకారం అందించాను. ప్రస్తుతం స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాను. రోజూ దినపత్రికలే నా కాలక్షేపం."

అమ్మతో కలసి జైలుకెళ్లాను

- రావూరి మనోరమ, స్వాతంత్ర్య సమరయోధురాలు, 98 ఏళ్లు

"సొంత గొడవే కానీ స్వాతంత్ర్యోద్యమ విలువలు ఈనాడు పట్టినదెవరికి? ఆనాడు అంతా ఒక్కటై దేశంకోసం పోరాడాం. ఈనాడు ఎవరికి వారు గొప్పగా బతకాలని ప్రతిఒక్కరూ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత స్వార్థం పెరిగింది. మనం ఇవాళ అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు తమకు పుట్టుకతోనే వచ్చినవేనన్నది ఈ తరం అభిప్రాయం. అవి ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా సిద్ధించాయన్న కనీస స్పృహ, ఆలోచన నేటి యువతీ, యువకుల్లో లేకపోవడం బాధాకరం. ఉద్యోగరీత్యా ఎన్నో మంచి అవకాశాలను సునాయాసంగా వదిలి జాతీయోద్యమానికి అంకితమయ్యారు మా నాన్న గోపరాజు రామచంద్రరావు (గోరా). సమాంతరంగా ఆంధ్ర దేశంలో కుల నిర్మూలనోద్యమానికి నాయకత్వం వహించారు. నాస్తికోద్యమంలో ఆయనకు శిష్యుడైన రావూరి అర్జునరావుతో నాకు వివాహం జరిపించి గొప్ప ఆదర్శవాదిగా నిలిచారు. ఇప్పుడు ఆ నిబద్ధత, చిత్తశుద్ధి, నిజాయితీ సమాజంలో పెద్దగా కనిపించడం లేదు.

క్విట్ ఇండియా పోరాటం...

ఒక్క స్వాతంత్ర్య పోరాటమే కాదు, సామాజిక మార్పు కోసం మా నాన్న తలపెట్టిన ప్రతి సంఘ సంస్కరణ ఉద్యమంలో అమ్మ సరస్వతీ గోరాతో పాటు మేమంతా పాల్గొన్నాం. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో విజయవాడలోని ఒకచోట అమ్మ, మా మేనత్త సామ్రాజ్యంతో పాటు నేను, మరి కొంతమంది మహిళలం సమావేశమయ్యాం. అప్పుడు నా వయసు 14 ఏళ్లు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలిస్తూ ర్యాలీకి అలా కదిలామో లేదో... మమ్మల్ని పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ సబ్ జైలులో కొన్ని రోజులు నిర్బంధించిన తర్వాత... మమ్మల్ని రాయవెల్లూరు జైలుకు తరలించారు. కారాగారం అనే మాటే గానీ... ఆట, పాటలతో చాలా సందడిగా ఉండేది. ఒకరితో ఒకరు ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో మెలిగేవాళ్లు. జైలర్లు కూడా మమ్మల్ని చాలా గౌరవంగా చూసేవారు. ఆ ఆరునెలల జైలు జీవితం మరచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చింది.

మహాత్ముడు నిర్ణయించిన ముహూర్తం...

అర్జునరావుతో నాకు వివాహం నిశ్చయించిన తర్వాత ఆ విషయాన్ని గాంధీగారికి మా నాన్న చెప్పారు. బులుసు సాంబమూర్తి గారి ద్వారా నా ఇష్టాయిష్టాలను తెలుసుకున్న తర్వాత... సేవాగ్రామ్‌లో తన చేతుల మీదుగా మా పెళ్లి జరిపిస్తానని మహాత్మా గాంధీ మాట ఇచ్చారు. అయితే... రెండేళ్లు ఆగమన్నారు. నాకు తూర్పుగోదావరి జిల్లాలోని కస్తూర్బా ఆశ్రమంలో జీవన నైపుణ్యాల శిక్షణ ఇప్పించాల్సిందిగా ఆదేశించారు. అర్జున్‌రావును తన వెంట వార్ధాకు తీసుకువెళ్లారు. ఏడాది తర్వాత ఒక రోజు... 1948, మార్చి 13న మా వివాహానికి మహాత్మాగాంధీ ముహూర్తం ప్రకటించారు. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో... ఆ ఏడాది జనవరి 30న గాంధీ హత్యకు గురయ్యారు. బాపూజీ లేకపోయినా, ఆయన నిర్ణయించిన ముహూర్తానికి సేవాగ్రామ్‌లోని కస్తూర్బా కుటీరం దగ్గర ఆనాటి దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ లాంటి మహనీయుల సమక్షంలో... అర్జునరావు, నేను నూలుదండలు మార్చుకొని వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాం. అతిథులకు వేపిన వేరుశెనగపప్పు, బెల్లం పంచారు.

లోక్‌నాయక్ పరామర్శ...

వివాహానంతరం కృష్ణాజిల్లా వానపాములలో కొన్నాళ్లు ఉన్నాం. ఆ సమయంలో నా యోగక్షేమాలు తెలుసుకోవడంకోసం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణగారు ఆ ఊరు వచ్చారు. గ్రామంలోని దళితవాడలో మేము నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు చూసి మెచ్చుకొన్నారు. తర్వాత 1960 నుంచి నలభై ఏళ్లకు పైగా గుడివాడలో 'అంబేద్కర్ హరిజన బాలికా వసతి గృహం' నడిపాం. వారందరికీ నేనే స్వయంగా వండి వడ్డిస్తే, అమ్మాయిల చదువు బాధ్యతను అర్జునరావు చూసుకున్నారు. అలా ఎంతో మంది నిరుపేద అమ్మాయిలకు తల్లిదండ్రులుగా మారి, చేతనైన సాయం అందించడానికి ప్రయత్నించాం. ఒంట్లో ఓపికున్నంత కాలం పార్టీ రహిత ప్రజాస్వామ్యాన్ని, నాస్తికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేశాం. ఇప్పుడు మా పిల్లలు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, అమ్మాయి సూయజ్ కలసి 'మార్పు' ట్రస్ట్ ద్వారా కొన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

- గుత్తా జవహారి బాయి, 102 ఏళ్లు

"పెద్ద వయసు వల్ల కాలు బయట పెట్టలేకపోయినా, బయట ఏం జరుగుతోందో నాకు తెలుసు. టెలివిజన్‌లో ముఖ్యమైన వార్తలు ప్రతిరోజూ తప్పనిసరిగా చూస్తాను. నేటి రాజకీయాలు బాగోలేవు. అంతా స్వార్థం, అవినీతి, నిలకడలేనితనం. స్వాతంత్ర్యం వచ్చి 78ఏళ్లు అయినా... ఈ దేశంలో ఇంకా కూడు, గూడులేనివారు ఎంతోమంది ఉన్నారంటే, సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదనే కదా అర్థం! ఏమయ్యాయి ఆనాటి స్వాతంత్ర్యోద్యమ ఆశలు, ఆకాంక్షలు? జాతీయోద్యమంలో మా కుటుంబం మొత్తం పాల్గొని జైలుకు వెళ్లింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కారణంగా నా భర్త గుత్తా సుబ్రహ్మణ్యం సోదరులు రామానుజయ్య, రాఘవయ్య, చలమయ్య, మా ఆడపడుచు రాజారత్నం, నా పెద్ద తోటి కోడలు సుందరమ్మ... వీరంతా జైలు శిక్ష అనుభవించారు. సుందరమ్మ అయితే విష జ్వరంతో బాధపడుతూ రాయవెల్లూరు జైలులోనే మరణించింది. 'బ్రిటిష్ ప్రభుత్వం నశించాలి', 'స్వాతంత్ర్యం కావాలి' అని రోడ్డుమీద నినాదాలు చేసినందుకు నన్నూ అరెస్టు చేసి, కొద్దిరోజులు జైల్లో ఉంచారు.

నేతాజీకి మా నాన్న స్నేహితుడు

నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌కు మా నాన్న గుంటూరు సుబ్బారావు మంచి స్నేహితుడు. కోల్‌కతా ఒరియంటల్ కాలేజీలో వారిద్దరికీ పరిచయం. వారిమధ్య చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా నడిచాయి. నేతాజీ స్ఫూర్తితో మా నాన్న కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. నాన్నకు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో సత్సంబంధాలున్నాయని తెలిసి పోలీసులు చాలారోజులు ఆయనను వెంటాడారు. అటు నా పుట్టింటివారు, ఇటు మెట్టినింటి వారు స్వాతంత్ర్యోద్యమంతో పాటు సంఘ సంస్కరణోద్యమంలోనూ భాగమయ్యారు. ఇప్పుడు ఆ విలువలను కొనసాగించడానికి యువత ముందుకు రావాలి. మహనీయుల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి."

• సాంత్వన్, ఫొటోలు: హరిప్రేమ్

క్రైం కార్నర్

గన్యాగుల వద్ద స్కూల్ బస్సు బోల్తా

- 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా పడి 20 మంది విద్యార్థులకు స్వల్పగాయాలైన ఘటన నాగర్‌కర్నూల్ మండలం గన్యాగుల గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకున్నది. పెద్దకొత్తపల్లి మండలం ఆల్‌సెయింట్స్ స్కూల్‌కు చెందిన బస్సు గన్యాగుల నుంచి పెద్దకొత్తపల్లికి విద్యార్థులను తీసుకొచ్చే క్రమంలో ఈ ఘటన జరిగింది. గన్యాగుల సమీపంలో బస్సు డ్రైవర్ ఓ బైక్‌ను తప్పించబోగా బస్సు అదుపు తప్పి వరి చేనులోకి దూసుకెళ్లింది. అక్కడ నాట్లు వేస్తున్న కూలీలు బోల్తా పడిన బస్సులో నుంచి విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి.

దారి దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : దారి దోపిడీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబ్‌నగర్‌కు చెందిన అరుణ్‌రెడ్డి జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలోని రిడి వైన్స్ షాపులో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన రాత్రి దుకాణం మూసివేసిన తర్వాత, రూ. 1.44 లక్షల నగదును బ్యాగ్‌లో పెట్టుకొని, ద్విచక్రవాహనంపైపట్టణానికి బయలుదేరాడు.

మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని వీరన్నపేటకు చెందిన మూలింటి బాలాజీ, మూలింటి రవితేజలు నక్కల బండ తండా వద్ద అరుణ్‌రెడ్డిని అడ్డగించారు. అతడి కళ్లల్లో కారం చల్లి క్యాష్‌బ్యాగ్ ఎత్తుకెళ్లారు. బుధవారం కొత్తతండా సమీపంలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తుండగా వీరిద్దరూ అనుమానాస్పదంగా కన్పించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దారి దోపిడీకి పాల్పడింది తామేనని వారు అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు అంతకుముందు జడ్చర్లలోని గగన లాడ్జిలో బస చేసి, వైన్స్ వద్ద రెక్కీ నిర్వహించారని చెప్పారు. క్యాషియర్ నగదు తీసుకెళ్లే సమయాన్ని గమనించారన్నారు. ఆ తర్వాత దోపిడీకి పాల్పడ్డారని వివరించారు. నిందితులు దోపిడీకి వినియోగించిన స్కూటీతో పాటు, బాలాజీ వద్ద రూ.47,500, రవితేజ వద్ద రూ25 వేలతో పాటు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీఐ కమలాకర్, కానిస్టేబుల్స్ ఉన్నారు.

పోలీస్ కస్టడీలో కానిస్టేబుల్ రాకేశ్

వనపర్తి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పరిధిలో ఓ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ రాకేశ్‌ను బుధవారం సీఐ కృష్ణ ఆధ్వర్యంలో కస్టడీలోకి తీసుకున్నారు. తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి ఒకే ఇంటిపై వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సంఘటనలో రాకేశ్‌ను వారం రోజుల క్రితం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి మరింత సమాచారం రాబట్టేందుకు పోలీసులు కోర్టు అనుమతితో రాకేశ్‌ను కస్టడీకి తీసుకున్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న ఓ మండల పోలీస్ స్టేషన్‌లో అతడిని విచారిస్తున్న సీఐ తెలిపారు.

ఆటో బోల్తా, యువకుడి మృతి

కొల్లాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని నార్లాపూర్‌లో ఆటో బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన దాసరి రాజు (24) మంగళవారం రాత్రి స్నేహితుడు మల్లేశ్‌తో కలిసి ఆటోలో ఊరి సమీపంలోని చెంచుగూడేనికి బయలుదేరాడు. గూడెం సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటో నడుపుతున్న దాసరి రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనపై మృతుడి తల్లి నాగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సీతాఫలాలా సేకరణకు టెండర్లు

- మహమ్మదాబాద్, మహబూబ్‌నగర్‌కు రూ.8 లక్షలపైనే
- నవాబ్‌పేట టెండర్‌లో అధికారుల అత్యుత్సాహం.. తగ్గిన వేలం



అటవీశాఖ కార్యాలయం వద్ద వేలంలో పాల్గొనేందుకు వచ్చిన వ్యాపారులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలోని అటవీ భూములలో ఈ ఏడాది సీతాఫలాల సేకరణకు అటవీశాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. బుధవారం నగరంలోని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించిన వేలంపాటకు ఆయా మండలాలకు చెందిన వ్యాపారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్, మహమ్మదాబాద్, నవాబ్‌పేట మండలాలకు సంబంధించిన వేలం పాట వేర్వేరుగా నిర్వహించారు. ముందుగా మహబూబ్‌నగర్, మహమ్మదాబాద్ మండలాలకు సంబంధించిన వేలం పాట పోటాపోటీగా సాగింది. చివరకు మహమ్మదాబాద్ మండల వేలంపాట రూ.8.71 లక్షలకు ఆంజనేయులు దక్కించుకోగా, మహబూబ్‌నగర్ మండలానికి సంబంధించి రూ.8.61 లక్షలకు నాయక్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఇక చివరగా నవాబ్‌పేట వేలం పాటను ప్రారంభించారు. అదే రేంజ్‌లో పాడతారని భావిస్తున్న తరుణంలో వేలం పాట నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారి వ్యాపారులతో కుమ్మక్కై రూ. 3.20 లక్షలకే ముగించారు. మిగతా సభ్యులు వేలం పాడుతుండగానే వారికి లబ్ధి చేకూర్చాలని ఎక్కువ సమయం ఇవ్వకుండా టకీమని వేలం ముగించడంతో వేలం పాడుతున్న మిగతా వ్యాపారులు కంగుతినాల్సి వచ్చింది. మేము పాట పాడుతుండగానే మీరు వెంటవెంటనే మూడోసారి అని వేలం ఎలా ముగిస్తారని ప్రశ్నించారు. ఆయన మాత్రం అవేమీ పట్టించుకోకుండా వేలం ముగిసిందంటూ వెళ్లిపోవడం గమనార్హం.

గతేడాది ఇదే మండలానికి రూ.6 లక్షల వరకు టెండర్ పాడగా, ఇప్పుడు అందులో సగానికే అధికారులు ముగించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులపై రాజకీయ ఒత్తిడి కారణంగానే సదరు వ్యాపారులకు ప్రయోజనం చూకూరేలా వేలం తొందరగా ముగించారని తోటి వ్యాపారులు ఆరోపిస్తున్నారు. నవాబ్‌పేట మండలానికి తిరిగి వేలంపాట నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది కూడా సీతాఫలాల టెండర్ల విషయంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి.

క్రెడిట్‌కార్డు పేరుతో మోసం

- బ్యాంకు ఖాతాల్లోంచి నగదు స్వాహా



క్రెడిట్‌కార్డు పేరుతో రూ. 8వేలు మాయమైనట్లు చూపిస్తున్న అన్వార్

గద్వాల క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : క్రెడిట్‌కార్డు అప్‌డేట్ పేరుతో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాల్లో నుంచి నగదు స్వాహా చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన అన్సార్ అనే వ్యక్తికి మంగళవారం వాట్సాప్‌లో ఓ లింక్ రావడంతో క్లిక్ చేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికి ఓ వ్యక్తి ఫోన్ చేసి, మీకు క్రెడిట్‌కార్డు వచ్చిందని, ఖాతా నెంబర్ చెప్పాలని కోరాడు. అనుమానం వచ్చిన అతడు అందుకు నిరాకరించాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ ఫోన్ రావడంతో మాట్లాడాడు. క్రెడిట్‌కార్డు అప్‌డేట్ కోసం పాన్‌కార్డ్ నంబర్ చెప్పాలని కోరాడు. దీంతో నమ్మిన అన్సార్ పాన్‌కార్డు నెంబర్ చెప్పాడు. దీంతో అతడి ఖాతాలో నుంచి మొదట రూ.3 వేలు, ఆ తర్వాత రూ.5 వేలు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అతడు తన ఖాతాలో మిగిలిన రూ. 47 వేలను వేరే ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేశాడు. బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే ఒంటెలపేటకు చెందిన వెంకటేష్ అనే వ్యక్తిని కూడా సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ.40 వేలు స్వాహా చేయడంతో అతడు కూడా పోలీసులను ఆశ్రయించాడు.

కేజీబీవీ వర్కర్ల తొలగింపు

బల్మూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం జరిగిన గొడవపై అధికారులు విచారణ చేపట్టారు. కారణమైన ముగ్గురు వర్కర్లను విధుల నుంచి తొలగించినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వర్కర్ల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం విద్యార్థులకు టిఫిన్ వడ్డించే సమయంలో వారి మధ్య వివాదం తలెత్తింది. సర్దుకుపోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి లలిత వారికి నచ్చచెప్పినా వారు వినలేదు. మద్యం మత్తులో ఉన్న వారు ఆమెతో గొడవకు దిగారు. ఈ విషయంపై ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో రాఘవులు, ఎస్ఐ రాజేందర్, ఎంఈవో విష్ణుమూర్తి బుధవారం పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

బేకరీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



జడ్చర్లలోని శ్రీలక్ష్మీ బెంగళూరు బేకరీ అండ్ స్వీట్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీ బెంగళూరు బేకరీ అండ్ స్వీట్స్ దుకాణంలో కర్రిపఫ్‌లో పాముపిల్ల వచ్చిన సంఘటన ఫిర్యాదుతో బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ బృందం తనిఖీలు నిర్వహించారు. బేకరీలో పరిశుభ్రత పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే గడువుతీరిన సామగ్రిని వినియోగిస్తున్నట్లు గుర్తించారు. పాముపిల్ల వచ్చిన కర్రిపఫ్‌ల శ్యాంపిల్స్‌ను సేకరించి, ల్యాబ్‌కు పంపించినట్లు వివరించారు. పరిశుభ్రత లోపించడం, గడువు తీరిన సామగ్రిని వినియోగిస్తుండడం, ఫుడ్‌లైసెన్స్ లేకుండానే బేకరీ నిర్వహిస్తుండడంతో నోటీసు జారీ చేశామని తెలిపారు. నోటీసు గడువు 7 రోజులు ఉంటుందని, ఆలోగా ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత పాటించకపోవడంపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బేకరీలో సామగ్రిని పరిశీలించారు. జిల్లా కేంద్రంతో పాటు పలు హోటల్స్‌ను తనిఖీలు చేపడుతున్నామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న హోటల్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్యాపకుల ఎంపికకు 28 మంది



పీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పార్ట్‌టైం అధ్యాపకుల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ పూస రమేష్‌బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కళాశాలకు బుధవారం పీయూలోని పరిపాలన భవనంలో ఎంపికల ప్రక్రియను నిర్వహించారు. ఈ ఎంపికలకు 32మంది దరఖాస్తులు చేసుకోగా, అందులో 28మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో పార్ట్‌టైం అధ్యాపకులుగా ఎంపికైనవారిని త్వరలోనే ప్రకటిస్తామని పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



జడ్చర్ల మండలంలోని గంగాపురం సమీపంలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని గంగాపురం, కోడుపర్తి, నసరుల్లాబాద్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో మిరప, మొక్కజొన్న పంటలను బుధవారం పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ పద్మ, డాక్టర్ దివ్య, డాక్టర్ మాధురి, మహబూబ్‌నగర్ ఏరువాక కేంద్రం సమన్వయకర్త అర్చన పంటలను పరిశీలించారు. మిరపలో తామర పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ఫెప్రోనిల్ 400 మిల్లీ లీటర్ల ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఉధృతిని గుర్తించారు. నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రామాలను పిచికారి చేయాలని సూచించారు. కంది పంటలో మారుక మచ్చల పురుగును గమనించిన శాస్త్రవేత్తలు నివారణ చర్యలు చేపట్టేందుకు వేపనూనె 1500 పీపీఎం 1లీటరును ఎకరానికి వాడుకోవాలని సూచించారు. జడ్చర్ల మండలం వ్యవసాయశాఖ అధికారి గోపీనాథ్, ఏఈవో శేఖర్, రైతులు పాల్గొన్నారు.

డీ8 కాలువకు మరమ్మతులు చేపట్టండి

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రామన్‌పాడు రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న డీ 8 కాలువకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువ తెగిపోయే పరిస్థితి దాపురించిందని మేడపల్లి, దేవరపల్లి, తిప్పడంపల్లి, కత్తెపల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవికాలంలో కాలువ మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు సంబంధిత ఇరిగేషన్ అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో కాలువలలో ముళ్లపొదలు, జమ్మూ, పూడిక పేరుకుపోవడంతో తెగిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు అంటున్నారు. దీనికి తోడు గత వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా కాలువ ఎక్కి వరి చేలల్లోకి నీరు వెళ్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా కాలువ తెగిపోయి పంట చేలు వరద దాటికి కొట్టుకుపోయిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతుల ఆధ్వర్యంలోనే మరమ్మతులు చేపట్టామని అంటున్నారు. అలాగే 72 గంటల పాటు భారీ వర్షాలు ఉన్నాయని ప్రజలు లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద మరింత వచ్చి కాలువ తెగిపోయే పరిస్థితి దాపురిస్తుంది అదే జరిగితే నాలుగు గ్రామాలను కలుపుకొని వందల ఎకరాలు నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుంది. ఇరిగేషన్ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

గండీడ్ ఏపీఎంగా రజిత

గండీడ్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గండీడ్ ఏపీఎంగా రజిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించే బాల్‌రాజ్ కుల్కచర్ల మండలం చౌడాపూర్‌కు బదిలీపై వెళ్లగా.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నుంచి రజిత గండీడ్‌కు వచ్చింది.

కేజీబీవీలో ఏఎన్ఎంను నియమించాలి

రాజాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఏఎన్ఎంను నియమించాలని రాజాపూర్ మండల విద్యార్థి సంఘాల నాయకులు బాలరాజ్, ప్రశాంత్, రవీందర్ డీఈవో ప్రవీణ్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. విద్యార్థినులు అస్వస్థకు గురైతే ఆసుపత్రికి తీసుకెళాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

16న జిల్లా ఎస్‌జీఎఫ్ వాలీబాల్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న జిల్లా అండర్-15 వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో ఒరిజినల్ స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు ఎంపికలకు హాజరుకావాలని కోరారు.

నేడు అభ్యంతరాల స్వీకరణ

గండీడ్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా మండలంలోని సాలర్‌నగర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఈ క్రమంలో డిజిటల్ సర్వే పూర్తి చేసి, రీ సర్వే చేసి రైతు పేరు, విస్తీర్ణం మరియు పహణి ప్రకారం నూతన సర్వే నంబర్లు తయారు చేసినట్లు తహసీల్దార్ మల్లిఖార్జున్ రావు తెలిపారు. దీంతో ఏమైన అభ్యంతరాలు ఉంటే గురువారం ఉదయం 10 గంటలకు గ్రామంలోని రచ్చబండ వద్ద నిర్వహించే కార్యక్రమానికి రైతులు పాల్గొని, అభ్యంతరాలు ఇవ్వాలని తెలిపారు.

నాలాలో పడిన మహిళను రక్షించిన పోలీసులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరంలోని కిద్వాయిపేట దగ్గర ఉన్న పెద్ద నాలాలో బుధవారం పాతతోటకు చెందిన ఎల్లమ్మ ప్రమాదవశాత్తు పడిపోయింది. స్థానికులు డయల్ 100కు కాల్ చేయడంతో వన్ టౌన్ సీఐ అప్పయ్య, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని సదరు మహిళను సురక్షితంగా బయటకు తీశారు. చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

హన్వాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యారోనిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం బూట్లు, టై, బెల్ట్‌లను ఎంపీడీవో యశోదమ్మ, ఎంఈవో గోపాల్‌నాయక్, హెచ్ఎం శ్రీలత అందజేశారు. గ్రామానికి చెందిన వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి సభ్యులు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించడం సంతోషం అన్నారు. సమితి సభ్యులు బాలయ్య, శేఖర్, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు ఆనందరెడ్డి, బాలకిష్టయ్య, రాకేష్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

భూత్పూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలోని శేరిపల్లి(బీ) గ్రామ శివారులోని ఓ పరిశ్రమలో వెలసిన సాయిబాబా మందిరంలో బుధవారం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, సాయిబాబాకు అర్చనలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

రంగనాయక స్వామి ఆలయంలో..

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ బాదేపల్లి పాతబజారు సమీపంలోని రంగనాయకస్వామికి బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంతికుమార్‌కు ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కాల్వరాంరెడ్డి దంపతులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బీజేపీ నాయకులు జక్కా రఘునందన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, నాగరాజు, సూర్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, కరాటే రవి, జగదీశ్, రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మూసాపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిపేటకు చెందిన గౌతమి అనే విద్యార్థి (8) మంగళవారం పాము కాటుకు గురై మృతి చెందింది. కాగా బుధవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు రాంరెడ్డి, భాస్కర్, నారాయణరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పదేళ్ల నిరీక్షణకు తెర

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి » 3340 మందికి రేషన్‌కార్డుల పంపిణీ



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల నిరీక్షణకు తెర పడిందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మినీశిల్పారామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 3340 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేషన్‌కార్డులు పంపిణీ చేసి, మాట్లాడారు. పదేళ్లుగా గత ప్రభుత్వం ఎవరికీ రేషన్‌కార్డు ఇవ్వకపోవడంతో పేదలు నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ ప్రక్రియను ప్రారంభించిందన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, నాయకులు బెక్కరి అనిత, సంజీవ్‌ముదిరాజ్, సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేష్, వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, పెద్ద విజయ్‌కుమార్, సీజె బెనహర్, చంద్రకుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీ, వసంత, అజ్మత్‌అలీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఆకలితో ఉండకూడదు - ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మిడ్జిల్ : ప్రజా పాలనలో ఎవరూ ఆకలితో ఉండరాతనే కాంగ్రెస్ ప్రభుత్వ అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యలయ సమావేశపు మందిరంలో 440 కొత్త రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని 440 కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాగా, పాత రేషన్‌కార్డుల్లో 2343 మందిని చేర్చడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఇప్పటికే 22 విద్యుత్ సబ్‌స్టేషన్‌లను మంజూరు చేయడం జగిందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజు, ఎంపీడీవో గీతాంజలి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రబ్బాని, నాయకులు గౌస్, వెంకటయ్య, సాయిలు, ప్రశాంత్‌రెడ్డి, సత్యంగౌడ్, శంకర్‌నాయక్, రాజిరెడ్డి, సంపత్‌కుమార్, పర్వతాలు, మల్లయ్య, ఉస్మాన్, రాజేష్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయం : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి



ర్యాలీ నిర్వహిస్తున్న పీయూ విద్యార్థులు

మహబూబ్‌నగర్/భూత్పూర్/మిడ్జిల్/కోయిలకొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు ఎస్పీ జానకి పేర్కొన్నారు. నాశ ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నిర్మూలనకు సామూహిక ప్రతిజ్ఞలు నిర్వహించారు. బుధవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ధర్మాపూర్‌లో ఎస్పీ జానకి పాల్గొని విద్యార్థులచే ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజాన్ని మాదకద్రవ్యాల భారి నుంచి రక్షించాలంటే కుటుంబం, విద్యాసంస్థలు, పోలీస్‌శాఖ కలిసి పని చేయాలన్నారు. అనంతరం పోలీసు కళాజాత బృందం, షీటీమ్ బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలోనే సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, డీసీఆర్‌బీ బీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏవో రుక్మిణిభాయి, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేశ్, రవి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు. భూత్పూర్ మండల కేంద్రంలో ఎస్ఐ చంద్రశేఖర్ మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని కళాశాల విద్యార్థులతో ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, కరణ్‌జీరావు పాల్గొన్నారు. కోయిలకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, పారుపల్లి శ్వేత విద్యామందిర్‌లో ఎస్ఐ తిరుపాజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పాలమూరు యూనివర్సిటీ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం పీయూలోని ఎన్ఎస్ఎస్ సెల్ 6,7 యూనిట్ల ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు విద్యార్థులతో కలిసి పీయూ మెయిన్ గేట్ నుంచి ఫార్మసీ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ రవికాంత్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ చిన్నదేవి, డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ పర్వతాలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు విగ్రహాల తొలగింపు



అంబేద్కర్ విగ్రహాన్ని తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది



తొలగించిన నెహ్రూ, ఇందిరాగాంధీల విగ్రహాలను డీసీఎంలో తరలిస్తున్న దృశ్యం

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణ నడిబొడ్డున ఉన్న విగ్రహాల తొలగింపునకు గ్రహణం వీడింది. చించోడు నుంచి కోదాడ వరకు 167వ జాతీయ రహదారి నిర్మాణంలో సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో విగ్రహాల తొలగింపు జాప్యం కావడంతో రోడ్డు నిర్మాణ పనులు సైతం ఆలస్యమవుతున్నాయి. చివరికి మునిసిపల్ పాలకవర్గం, కమిషనర్ బుధవారం విగ్రహాల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు ఇందిరమ్మ చౌరస్తాలోని జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ విగ్రహాలను తొలగించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలను తొలగిస్తుండగా దళిత, బీసీ సంఘాల నాయకులు అడ్డుకున్నారు. అంబేడ్కర్ విగ్రహాన్ని అలాగే ఉంచాలంటూ వాగ్వావాదానికి దిగారు. అదే సందర్భంలో అటుగా వెళ్తున్న మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అక్కడికి చేరుకొని విగ్రహాల తొలగింపు చేపట్టాల్సిన అవశ్యకతను సంఘాల నాయకులకు వివరించి, అందరి అభిప్రాయం మేరకే విగ్రహాలను పునఃప్రతిష్టిద్దామని సముదాయించారు. దీంతో అంబేడ్కర్, జ్యోతిరావుపూలే విగ్రహాలు ఒకే సారి తొలగించాలంటూ ఇరు సంఘాల నాయకులు షరతు పెట్టడంతో రెండు విగ్రహాలు ఒకే సారి తీసేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో విగ్రహాలను భద్రపరచనున్నట్లు మునిసిపల్ పాలకవర్గం, కమిషనర్లు వెల్లడించారు. సీఐ కమలాకర్, ఎస్ఐలు మల్లేష్, ఖాదర్ బందోబస్తు నిర్వహించారు.

తెలంగాణలోనూ అందరి కులదైవం వెంకన్నే - మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తిరుమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాలు వేరైనప్పటికీ తెలంగాణలోనూ ప్రతీ ఇంటి కులదైవం వేంకటేశ్వరస్వామే అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, బేధాభిప్రాయాలు లేకుండా అన్ని ప్రాంతాల్లో టీటీడీ దైవ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. మహబూబ్‌నగర్‌లోని మణ్యంకొండ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కల్యాణ మండపం కావాలని టీటీడీని కోరామన్నారు. తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లోనూ శ్రీవారి ఆలయాలు, కల్యాణ మండపాల నిర్మాణం జరిగితే బ్రహ్మాండంగా ఉంటుందన్నారు.

గణేశ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకుందాం

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో వినాయక ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని విశ్వహిందూ పరిషత్ నాయకులు జగ్‌పాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వాసవీకన్యకపరమేశ్వరీ ఆలయంలో బుధవారం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగసాల సమీపంలో గణేశ్ నిమజ్జనం నిర్వహించాలని తీర్మానం చేశారు. ఉత్సవ కమిటీ నాయకులు రాంమోహన్, రంజిత్‌బాబు, బాలకృష్ణ, అఖిల్‌రెడ్డి, లావణ్యాయాదవ్, రాజుగౌడ్, చిరంజీవి, రఘు, సంజీవ్‌గుప్త, సంతోష్, శ్రీనాథ్, దత్తుప్రభు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మూసాపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం అడ్డాకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాజేశ్వర్‌రావు, ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

ఫిడెల్ కాస్ట్రోకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు మధు

పాలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అమెరికన్ సామ్రాజ్యవాదం గుండెల్లో సింహస్వప్నంగా నిలిచిన వ్యక్తి ఫెడెల్ క్యాస్ట్రో అని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు మధు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో క్యాస్ట్రో శత జయంతిని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. క్యూబాను అమెరికా ప్రభుత్వం సుమారు 600 సార్లు చంపేందుకు ప్రయత్నంచేసి విఫలమైందన్నారు. జిల్లా కార్యదర్శి రాములు, కురుమూర్తి, మోహన్, చంద్రకాంత్, రాజ్, జగన్, ఖమర్‌అలీ, భరత్, హనుమంతు, గాలెన్న, ఆదివిష్ణు, సయ్యద్ జహంగీర్, భగవంతు, యాదయ్య, శివలీల, ఖాదర్, నందు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

రాజాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్ అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి అఖిలపక్ష నాయకులతో కలిసి ఒత్తిడి తెస్తేనే రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు, విజయ్‌కుమార్, నరహరి, తిరుప తయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ రాజు, లింగం, మల్లేష్, ప్రశాంత్, రాజేష్, జంగయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

రేపు కోటి కుంకుమార్చన కార్యక్రమం



సమావేశంలో పాల్గొన్న అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షుడు సీమ నరేందర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం ప్రత్యేక పూజలలో భాగంగా అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని నీలకంఠ మల్లికార్జున స్వామి ఆలయంలో కోటి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్ప దీక్ష ప్రచార సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు సంస్థ వారే పూజా సామగ్రిని ఉచితంగా అందజేస్తారన్నారు. పూజలో పాల్గొనే మహిళలు ఆకుపచ్చ రంగు చీరలు ధరించి రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి రమేష్, అన్నదాన కమిటీ అధ్యక్షుడు రఘురాంగౌడ్, ప్రధాన కార్యదర్శి రవి, జయశంకర్, శ్రీనివాస్, నరసింహారావు, యాదయ్య గౌడ్, శివ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, నర్సింహారెడ్డి, జిల్లా అధికారులతో కలిసి భారీ వర్షాల వల్ల తీసుకోవాల్సిన చర్యలు, వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో వెబెక్స్ నిర్వహించారు. ఎస్‌డీఆర్ఎఫ్ 20 మంది టీం, గ్రామాల్లో ఆపద మిత్ర వలంటీర్ సేవలు అత్యవసర పరిస్థితిలో వినియోగించుకోవాలన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైన సందర్భాల్లో కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌కు 08542-241165 సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి పార్థసారథి, జెడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ అర్బన్ : వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను జాప్యం చేయకుండా సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వృద్ధులు, దివ్యాంగుల ప్రజావాణి నిర్వహించగా కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. ప్రత్యేక ప్రజావాణిలో 19 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా సంక్షేమ అధికారిణి జరీనాబేగం, డీఎంహెచ్‌వో కృష్ణ, అదనపు డీఆర్డీవో శారద, గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్, డీటీ సునీల్ పాల్గొన్నారు.

● పాలమూరు : జిల్లా కేంద్రంలో బుధవారం డీసీఎంఎస్, మనగ్రోమోర్ సెంటర్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, రిజిస్టర్లతో పాటు యూరియా లభ్యత, పంపిణీ విధానాన్ని పరిశీలించారు. యూరియాను ఎమ్మార్పీకే విక్రయించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, ఏవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాజాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య ఉప కేంద్రాల చుట్టూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ, భవిత కేంద్రాలతో పాటు కుచ్చర్‌కల్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం, ప్రభుత్వ పాఠశాల పరిసరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఐఆర్‌పీ ప్రణీష్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈవో ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో వెంకట్‌రాములు పాల్గొన్నారు.

పంద్రాగస్టు జెండావిష్కరణకు బాధ్యుల నియామకం

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి జిల్లాలో జాతీయ జెండావిష్కరణకు ప్రభుత్వం బాధ్యులను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించనుండగా, నారాయణపేట జిల్లాలో పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జోగుళాంబ గద్వాల జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, నాగర్‌కర్నూల్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వనపర్తిలో తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొనున్నారు.

ప్రతీ ఒక్కరు దేశ భక్తితో ముందుకు సాగాలి



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, విద్యార్థులు

మిడ్జిల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచంలోనే ప్రధాని మోదీ అత్యంత శక్తివంతమైన నాయకుడని, ప్రపంచ పటంలో దేశాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు అంజనేయులుతో కలిసి హర్ ఘర్ తిరంగ్ ర్యాలీని నిర్వహించారు. అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంట జాతీయ జెండా ఎగురవేయడంతో పాటు దేశ భక్తితో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, నాయకులు లక్ష్మారెడ్డి, నరేందర్, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, వాసుదేవ్, నరేష్, శేఖర్, శేఖర్‌రెడ్డి, దేవేందర్, రామకృష్ణ, నవీన్, శివ, శివశంకర్, మల్లేష్, హరీశ్, అరవింద్, వెంకటేష్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో మైసమ్మ ఆలయ పునఃనిర్మాణం పనులు బుధవారం ప్రారంభించారు. లైట్ మోటర్స్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో జాతీయ రహదారి వెడల్పులో తొలగించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పునఃనిర్మాణం పనులను మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి భూమి పూజ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వెన్నాచేడ్ మోడల్ పాఠశాలలో భోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి సంజీవ్‌కుమార్

నవాబ్‌పేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ సునీత పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంపీడీవో జయరాములుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం, కూరగాయలు పరిశీలించారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. అనంతరం ఇందిరమ్మ నమూన ఇంటితో పాటు పీహెచ్‌సీని సందర్శించి అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎంఈవో నాగ్యానాయక్, ప్రిన్సిపాల్ మాధవి పాల్గొన్నారు.

● గండీడ్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యే కాధికారి సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవా రం మండలంలోని వెన్నాచేడ్ మోడల్ పాఠశా లలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరిశ్చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పాలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్ పట్టణంలో నిర్వహించే సీపీఐ 4వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బాలకిషన్ ఆవిష్కరించి, మాట్లాడారు. కేంద్రం దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల ఓటర్ల జాబితాను తొలగించటం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికైనా అర్హులందరినీ ఓటర్లుగా గుర్తించి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. పద్మావతి, రాము, సురేష్, నరసింహ, భార్గవి, చాంద్ పాష, సత్యనారాయణరెడ్డి, మహేష్, ఆనంద్, శ్రీను, సుందర్‌రాజు, ఇందిరక్క, పుష్ప, శ్రావణ్, హనుమంతు, రమేష్ పాల్గొన్నారు.

'యూరియాతో పాటు లిక్విడ్ కొనాల్సిందే'

జడ్చర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్న రైతులపై పట్టణంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం-2 నిర్వాహకులు అదనపు భారం మోపుతున్నారు. బుధవారం ఆగ్రో రైతు సేవా కేంద్రంలో రైతులకు రెండు బస్తాల యూరియాతో పాటు రెండు నానో యూరియా లిక్విడ్ బాటిల్స్‌ను అంటగడుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులకు యూరియా బస్తాలను ఇవ్వమంటూ ఖరాకండిగా చెబుతున్నారు. ఈ సంఘటనపై కవరేజ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై నిర్వాహకులు దురుసుగా వ్యవహరించారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లగా అడిగిన రైతులకు మాత్రమే వినియోగించాలని, ఖచ్చితంగా ఇవ్వవద్దంటూ ఆగ్రోరైతుసేవా కేంద్రం నిర్వాహకులకు ఆదేశించారు.

సమస్యలపై సమీక్షించిన విద్యుత్ అధికారులు

పాలమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అంతటా బుధవారం ముసురు వర్షం నెలకొంది. జిల్లాలో విద్యుత్ సమస్యలు పరిష్కారంపై ఉన్నతాధికారులు ఫీల్డ్‌లో ప్రత్యేకంగా సమీక్షించారు. టీజీ ఎస్‌పీడీసీఎల్ కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణి, ఎస్ఈ వెంకటరమేష్, డీఈ లక్ష్మణ్, ఏడీఈ తౌర్యానాయక్, మద్దిలేటి, ఏఈలు అరుణ్‌నాయక్, ఆదిత్య, హరినాథచారి పట్టణంలో రాత్రి 11గంటల వరకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు.